



కడియపు లంక పల్ల వెంకన్న నర్సరీలో ప్రజలకు విరులతో ఇలా శుభాకాంక్షలు తెలిపారు. నర్సరీ అధినేత పల్ల సత్తిబాబు, యువ రైతులు వెంకటేష్, వినయ్ ఆధ్వర్యంలో దీన్ని తీర్చిదిద్దారు.

కోడి పందేలకు సై...

- పోలీసుల ఆదేశాలు బేఖాతర్
- ఇప్పటికే పలుచోట్ల బరులు సిద్ధం
- డిప్యూటీ సిఎం ఇలాకాలో 35 బరులు
- అండగా అధికార పార్టీ నేతలు ?

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా కోడి పందేలకు నిర్వాహకులు సై కొడుతున్నారు. ఇప్పటికే పలుచోట్ల బరులను సిద్ధం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఏర్పాటైన కోడి పందేల నియంత్రణకు క్షేత్రస్థాయి అధికారులు పహరా పెరగడంతో ఆదివారం రకూ బరులు సిద్ధం కాలేదు. కొన్ని చోట్ల తమ భూముల్లో కోడి పందేలు నిర్వహించేందుకు రైతులు వ్యతిరేకించడంతో వారిని ఒప్పించేందుకు నిర్వాహకుల్లు తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. కొన్నేళ్లుగా కొన్ని గ్రామాలు కోడిపందేల నిర్వహణకు ప్రసిద్ధి చెందాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాలలో పోలీసుల నిఘా పెరిగింది.
సంక్రాంతి సంబరాల పేరుతో అధికార పార్టీకి చెందిన నాయకులు బరులు సిద్ధం చేస్తున్నారు. పోలీసు అధికారులు ఆంక్షలు విధించినప్పటికీ జూదరులు పట్టించుకున్న దాఖలాలు ఎక్కడా కనిపించట్లేదు.

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రామచంద్రపురం, రాయవరం, మండపేట, రాజోలు, సఖినేటిపల్లి, ముమ్మిడివరం, అంబాజీపేట, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల్లో భారీ బరులను ఏర్పాటు చేస్తున్నారు. బరుల వద్ద మంత్రులు, ఎంఎల్ఎలు, ఇతర నాయకులు ఫ్లెక్సీలను సైతం ఏర్పాటు చేస్తున్నారు. కోనసీమ జిల్లా వ్యాప్తంగా 100 నుంచి 150 వరకూ బరులను ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ఏదేమైనా తెల్లవారే సరికి బరులు ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే సామగ్రిని ఆయా ప్రాంతాలకు తరలించారు.

కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే చర్యలు

కోడిపందేలు, గుండాట, పేకాట తదితర జూదాలను నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. ఇటువంటి ఆటలను నిరోధించటానికి జిల్లా అంతటా ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. ఆడినా, నిర్వహించినా బైండోవర్ కేసులను నమోదు చేస్తాం. కోడిపందేలు, జూదం, గుండాట, ఇతర నిషేదిత ఆటలపై ఎటువంటి సమాచారం ఉన్నా 112కు సమాచారం ఇవ్వాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

- డి.నరసింహకిశోర్, ఎస్‌పి, తూర్పు గోదావరి


పిఠాపురంలో ఏర్పాటు చేసిన బరి

కొత్తపేటలో మెయిన్‌రోడ్డును ఆనుకుని పెద్ద బరిని ఏర్పాటు చేస్తున్నారు. కార్మిక శాఖ మంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న రామచంద్రపురంలో ఆయన ఫ్లెక్సీలను పెట్టి మరీ భారీ బరిని సిద్ధం చేశారు.

డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఇలాకా అయిన పిఠాపురం నియోజకవర్గంలో టిడిపి, జనసేన పార్టీల నాయకులు పోటాపోటీగా బరులను సిద్ధం చేస్తున్నారు. ఒక్క ఈ నియోజకవర్గంలోనే 35 వరకూ బరులను ఇప్పటికే నిర్వాహకులు సిద్ధం చేశారు. పిఠాపురం పట్టణంలోనే వైఎస్ఆర్ గార్డెన్స్‌లో అధునాతన హంగులతో బరిని ఏర్పాటు చేశారు. అందరికీ కనపడేలా తాత్కాలిక స్టేజిని నిర్మించి దానిపై మట్టితో బరిని ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఫెన్సింగ్‌ను సైతం ఏర్పాటు చేశారు. కాకినాడ జిల్లాలో ప్రత్తిపాడు, తుని, తొండంగి, గొల్లపోలు, పెద్దాపురం, సామర్లకోట, జగ్గంపేట, గండేపల్లి మండలాల్లోనూ బరులను ర్పాటు చేశారు.

తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండల కేంద్రంలో ఇప్పటికే బరులు సిద్ధం అయ్యాయి. తాళ్లపూడి మండలంలోని 6 గ్రామాల్లో 9 ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది ఆ ప్రాంతంలో మరో 10 బరులు అదనంగా ఏర్పాటు కానున్నట్లు తెలుస్తోంది. చాగల్లు మండలంలో మీనా నగరం, చిక్కాల, ఉన్నగట్ల, బ్రాహ్మణగూడెం, మార్కండపాడు, చంద్రవరం గ్రామ శివార్లలో బరులు ఏర్పాట్లు చేసేందుకు సమాయత్తమవుతున్నారు.కొవ్వూరు మండలంలో కొవ్వూరు, పంగిడి, కుమరదేవం, దొమ్మేరు గ్రామాల్లో బరులు సిద్ధం చేశారు. నిడదవోలులో సింగవరంలో భారీ బరి సిద్ధమవుతోంది. గత ఏడాది నిర్వహించిన ప్రాంతాల్లో పోలీసులు పహారా పెంచారు. పెరవలిలో పెరవలి, కండవల్లి, అద్దరంలలో బరులు సిద్ధమవుతున్నాయి. గోకవరం మండలంలో కృష్ణుని పాలెం,మల్లవరం రెండు ప్రాంతాల్లో పందెం రాయుళ్ల బరులు వేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. సీతానగరం, కడియం, రాజమహేంద్రవరం రూరల్‌లోనూ భారీ బరులను ఏర్పాటు చేస్తున్నారు.

తెర వెనుక కూటమి నేతల ప్రోత్సాహం

టిడిపి, జనసేన నేతలు స్వయంగా తెరవెనుక ఉండి కోడి పందేల నిర్వహణ ప్రోత్సహిస్తున్నారు. ఒకొక్క బరి ఏర్పాటుకు నిర్వహకుల నుంచి సుమారు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు ప్రజాప్రతినిధులకు ముట్టచెబుతున్నట్లు సమాచారం. సీతానగరం మండలం పురుషోత్తపట్నంలో ఇప్పటికే కోడిపందేలు ప్రారంభమయ్యాయి.కడియం మండలం బుర్రిలంకలోనూ సరిహద్దు ప్రాంతాలైన మడికి, చొప్పెళ్ల, నర్సిపూడి, ఏడిద, ఏడిద సీతాగనరంలలోనూ నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు జరుగుతున్నాయి. గతం కంటే ఎక్కుకవగా ఈ సారి నోట్లు చేతులమారే అవకాశం కనిపిస్తోంది..

18 వరకు జీడిపిక్కల కార్మికుల పోరాటం వాయిదా


కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు శేషబాబ్జి

ప్రజాశక్తి - ఏలేశ్వరం


చిన్నింపేట జీడిపిక్కల కార్మికుల పోరాటం ఆదివారానికి 59వ రోజుకు చేరుకుంది. ఈ శిబిరానికి సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషుబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు గత రెండు నెలలుగా మూసివేసిన ఫ్యాక్టరీని తెరవాలని పోరాడుతున్న ఇటు ప్రభుత్వంలో కానీ, అటు యాజమాన్యంలో కానీ ఎటువంటి స్పందన లేకపోవడం దారుణమన్నారు. కార్మికులకు న్యాయం జరిగే వరకూ ఈ పోరాటం కొనసాగుతుందని, వారి పోరాటానికి సిఐటియు అండగా ఉంటుందని అన్నారు. సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకుని కార్మికుల పోరాటాన్ని ఈ నెల 18వ తేదీ వరకు వాయిదా వేయడం జరిగిందని అన్నారు. యాజమాన్యం స్పందించకుంటే ఈ పోరాటం మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఒకపక్క కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడినా సిఎం, డిప్యూటీ సిఎంలకు కన్పించకపోవడం శోచనీయమన్నారు. ఒకపక్క కొత్త పరిశ్రమలంటూ ప్రకటనలు ఇస్తున్న వారు ఉన్న పరిశ్రమలను మూసివేస్తుంటే మాట్లాడకపోవడం దారుణమన్నారు. కార్మికులకు న్యాయం చేయమని అడిగిన వారిపై అక్రమ కేసులు పెట్టి బెదిరించడం సరికాదని అన్నారు. బెదిరింపులు, కేసులతో కార్మికుల ఉద్యమాన్ని అపలేరని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యుడు రొంగల ఈశ్వరరావు, కార్మికులు లోవరాజు, వీరబాబు, ధర్మాజీ, రామదుర్గ, ఒ.దుర్గప్రసాద్, భాగ్యలక్ష్మి, పాపారత్నం తదితరులు పాల్గొన్నారు.

భోగిమంటలో కరెంటు బిల్లులు దగ్ధానికి పిలుపు


కరపత్రం ప్రచారం కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజబాబు

ప్రజాశక్తి - కాజులూరు

ట్రూ ఆఫ్ ఛార్జీల పేరుతో ప్రజలపై కూటమి ప్రభుత్వం వేసిన భారాలకు వ్యతిరేకంగా భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దగ్ధం చేసి నిరసన తెలపాలని సిపిఎం మండల కన్వీనర్ వల్లు రాజబాబు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని కాజులూరు, చేదువాడ, శీలలంక, తర్లంపూడి గ్రామాల్లో విద్యుత్ ఛార్జీల పెంపుదల, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తున్న మత రాజకీయాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ట్రూ ఆఫ్ ఛార్జీలు పేరిట విద్యుత్ ఛార్జీలను పెంచి సామాన్యులపై కూటమి ప్రభుత్వం పెనుభారాన్ని మోపిందన్నారు. దీనికి నిరసనగా భోగిమంటల్లో కరెంటు బిల్లు తగలబెట్టి నిరసన తెలియజేయాలని కోరారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మత ఉన్మాద కార్యక్రమాలకు దూరంగా ఉండాలని కోరారు. దేశంలో మైనార్టీలు, క్రైస్తవులు, హిందువులు అందరూ ఓ తల్లి బిడ్డల ఉంటున్నారని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మత రాజకీయాలు చేస్తూ ఒక మతంపై మరోక మతస్తులను రెచ్చగొడుతుందని అన్నారు. ప్రజలందరూ మత ఉన్మాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మోడీ ప్రభుత్వం ఏం చేస్తున్న రాష్ట్రంలో మూడు రాజకీయ పార్టీలు నోరు మెదపడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నామా చంద్రరావు, నామా నాగబాబు, యాల కృష్ణ, వర్రె సత్యనారాయణ, చీకట్ల చిన్నబాబు, యాల పాండవులు, యాల శ్రీను, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

క్రీడా స్ఫూర్తితో మెలగాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడాలని ఆటల ద్వారా స్నేహభావం పెంపొందించుకోవాలని ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు అన్నారు. ముమ్మిడివరం ఎఎంసి మాజీ ఛైర్మన్ కుడిపూడి శివన్నారాయణ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల సందర్భంగా వాలీబాల్ పోటీలను స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 24 జట్లు పాల్గొన్నట్లు పీడీ గుత్తుల మల్లేశ్వరరావు తెలిపారు. నాకౌట్ పద్ధతిలో జరుగుతున్న ఈ వాలీబాల్ పోటీలు డే అండ్ నైట్ ఫ్లడ్ లైట్స్ కాంతుల్లో ఉల్లాసంగా జరుగుతున్నాయి. ఈ కార్య క్రమంలో మాజీ సర్పంచ్‌లు వి.శ్రీనివాస్, బి.లక్ష్మీనరసింహరాజు, నాయకులు బి.శ్రీనివాస్, కె.మల్లేష్, ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేడు ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

భీమేశ్వర స్వామి ఆలయం వద్ద హైదరాబాద్‌కు చెందిన దివీస్ లేబరేటరీ సంస్థ సుమారు రూ.18 లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్‌ఓ ప్లాంట్‌ను నేడు ప్రారంభం కానుంది. పాంట్‌ను సోమవారం ఉదయం 8 గంటలకు ఎంఎల్ఎ నిమ్మకాయల చిన రాజప్ప, కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి ప్రారంభిస్తారని ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం తెలిపారు.


సిహెచ్‌సిలో అరకొర సౌకర్యాలు..!

- ఏళ్లతరబడి 30 పడకలతోనే సరి
- ప్రతిపాదనలకు మోక్షం ఎప్పుడో
- తప్పని మందుల కొరత
- నిరూపయోగంగా నూతన భవనాలు

రౌతులపూడి సిహెచ్‌సిలో రోగులకు అరాకొర సౌకర్యాలే అందుతున్నాయి. బెడ్‌ల కొరతతోపాటు, మందుల కొరత వెంటాడుతోంది. ఏళ్లతరబడి 30 పడకల ఆసుపత్రిగానే ఉండిపోయింది. 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలనే ప్రతిపాదనలకు మోక్షం కలగడం లేదు. పరిస్థితులను బట్టి ఒకే బెడ్‌పై ఇద్దరు, ముగ్గురుకి వైద్య సేవలు అందించాల్సిన దుస్థితి నెలకుంది. గత ప్రభుత్వ పాలనలో నిర్మించిన భవనాలు అక్కరకు రాకుండాపోతున్నాయి.

ప్రజాశక్తి - రౌతులపూడి

సబ్ ప్లాన్ ఏరియాలో ఉన్న రౌతులపూడి సిహెచ్‌సిలో అరాకొర సౌకర్యాలే ఉండటంతో రోగులు పలు ఇక్కట్లకు గురౌతున్నారు. సిహెచ్‌సి పరిధిలోని పలు గిరిజన గ్రామాల నుంచి రోగులు నిత్యం పెద్ద సంఖ్యలోనే రావడం పరిపాటి. ప్రతీ రోజు సుమారు 300 నుంచి 500 వరకు ఓపి నడుస్తోంది. 30 పడకలతో నడుస్తున్న సిహెచ్‌సిలో నిత్యం ఇన్ పేషెంట్లు 30 నుంచి 40 మంది ఉంటున్నారు. రోగులకు అవసరమైన సౌకర్యాలు అరాకొరగా అందుతున్నాయి. ప్రస్తుతం 30 పడకలకు అవసరమైన మందులే సరఫరా అవుతున్నాయి. పైగా ప్రస్తుతం ఈ ఆసుపత్రిలో జనరల్ సర్జన్ లేకుండా సాగిపోతుంది. జనరల్ సర్జన్ లేకపోవడంతో శస్త్ర చికిత్సలకు సంబంధించిన రోగులను కాకినాడ జిజిహెచ్‌కు రిఫర్ చేస్తున్న పరిస్థితి నెలకుంది.



నారాయణమూర్తి సాయంతో ఆసుపత్రి నిర్మాణం

సబ్ ప్లాన్ ఏరియాకు చెందిన ప్రముఖ సినీ నటుడు, దర్శక, నిర్మత ఆర్.నారాయణమూర్తి సాయంతో ఈ ఆసుపత్రి నిర్మాణాలకు 1996లో శంకుస్థాపన చేశారు. ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన 4 ఎకరాలు భూమితోపాటు, దశలవారీగా రూ.30 లక్షలను ఆయన వెచ్చించారు. దీంతో 2000 సంవత్సరలో ఈ ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ ఆసుపత్రి నిర్మాణం కాకముందు ఈ ప్రాంతవాసులు ప్రాథమిక చికిత్స పొందేందుకు శంఖవరం, తుని ఇతర ప్రాంతాలకు వెళ్ళవలసి వచ్చేది. నారాయణమూర్తి దాతృత్వంతో ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రి ప్రారంభంలో కొంతకాలం వైద్యుల కొరత వేధించింది. ఇతర సమస్యలు వెంటాడాయి. అనంతరం ఆ సమస్యల నుంచి బయటపడటంతో పరిసర ప్రాంత ప్రజల ఆరోగ్య భద్రతకు భరోసాగా నిలిచింది. 30 పడకలతో ఈ ఆసుపత్రిని నాటి ప్రభుత్వం ప్రారంభించింది. అయితే ఈ ఆసుపత్రి ప్రారంభించి 29 సంవత్సరాలు దాటుతోంది. నాడు పదుల సంఖ్యలో ఉన్న రోగుల సంఖ్య నేడు వందల్లోకి వచ్చింది. అయినా నేటికీ ఈ ఆసుపత్రి 30 పడకలతోనే కొనసాగడం చూస్తుంటే పాలకులు ప్రజారోగ్యంపై ఏ మేరకు దృష్టి సారించారనేది స్పష్టం చేస్తోంది. రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ఈ ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

అందుబాటులోకి వచ్చేదెప్పుడో..

పెరుగుతున్న రోగుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని గత వైసిపి ప్రభుత్వం రూ.6.99 కోట్లు వెచ్చించి పలు భవన నిర్మాణాలను చేపట్టింది. అయితే ఆ నిర్మాణాలకు సంబంధించిన పనులు నత్తనడకన సాగాయి. ఈ నేపథ్యంలో 2024 సార్వత్రిక ఎన్నికల రానేవచ్చాయి. దీంతో ఆ నిర్మాణాలు పూర్తికాకుండానే ప్రభుత్వ పెద్దలు ఎంతో అట్టహాసంగా ఆ భవనాలను ప్రారంభించేశారు. అయితే ఆయా భవనాలు అసంపూర్తిగా ఉండిపోవడంతో అందుబాటులోకి వచ్చే పరిస్థితి కన్పించడం లేదు. దీనికితోడు భవనాలను నిర్మించిన కాంట్రాక్టర్ సైతం నాణ్యత ప్రమాణాలు పాటించకుండా హడావుడిగా పనులు చేపట్టినట్లు విమర్శలు లేకపోలేదు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు(ఫైల్ ఫోటో)

లేబరేటరీలో కొన్నింటికే పరీక్షలు

ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న లేబరేటరీ అరాకొర పరీక్షలకే పరిమితం అవుతోంది. సబ్ ప్లాన్ ఏరియాలో ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ప్రజలు వివిధ జ్వరాల భారిన పడుతుంటారు. అయితే ఈ లేబరేటరీ కేవలం మలేరియా, టైపాయిడ్ పరీక్షలకే పరిమితం అవుతోంది. ఇతర పరీక్షలు చేయాలంటే రోగులు ప్రయివేటు లేబరేటరీలను ఆశ్రయించక తప్పని పరిస్థితి. ఇదే అదునుగా ప్రయివేటు లేబరేటరీ నిర్వాహకులు గిరిజనుల అమాయికతత్వాన్ని ఆసరాగా చేసుకుని దండిగా సొమ్ములు చేసుకుంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు. తక్షణమే లేబరేటరీలో అన్ని రకాల పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన సాంకేతిక పరికరాలతోపాటు, అందుకు అవసరైన సిబ్బందిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.


అనుమతులు రావాల్సి ఉంది



ప్రస్తుతం 30 పడకల ఆసుపత్రిగా ఉన్న సిహెచ్‌సిని 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని ఉన్నతాధి కారులకు ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సివుంది.

-డాక్టర్ స్వప్న, డిసిహెచ్‌ఎస్,

కార్టూ'నిజం'



భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం

పథకాలు లేకుండా పండుగ ఎలా?

-నిలదీసిన మాజీ మంత్రి కురసాల



మీడియాతో మాట్లాడుతున్న కురసాల

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

పథకాలు లేకుండా పండగను ఎలా సంతోషంగా చేసుకోవాలని మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు కురసాల కన్నబాబు ప్రశ్నించారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు టిడిపి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను పక్కన పెట్టి హ్యాపీ సండే అని కొత్త పథకాన్ని పెట్టారని ఆయన ఎద్దేవా చేశారు. 2024లో జరిగిన సంక్రాంతికి 2025లో సంక్రాంతికి చాలా తేడా కన్పిస్తుందన్నారు. వైసిపి పాలనలో ఏదో పథకం పేరుతో పండుగల సమయంలో ప్రజలకు నగదును అందించేవారమని, కూటమి ప్రభుత్వంలో ఏ పథకం లేకుండా ప్రజలను నిరుత్సాహానికి గురి చేశారని అన్నారు. ప్రజల వద్ద డబ్బు లేక అన్ని రకాల వ్యాపారాలు మూలన పడ్డాయని అన్నారు. టిడిపిలోని పెద్ద పెద్ద నాయకులకు మాత్రమే పండగ వచ్చింది తప్పితే సామాన్యులకు పండగ లేకుండా పోయిందన్నారు. రాజకీయ కక్షతో కూటమి ప్రభుత్వం వైసిపి నాయకులు, కార్యకర్తలను గ్రామాల నుంచి తరిమేసిందని, పండగ పూట కూడా సొంత ఇంటికి రాలేని పరిస్థితులను రాష్ట్రంలో కన్పిస్తున్నాయని అన్నారు. వేంకటేశ్వర స్వామిని రాజకీయాల్లోకి లాగితే ఇటువంటి పరిణామాలే జరుగుతాయని, ప్రభుత్వాధినేతగా చంద్రబాబు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వైసిపి పాలనలో కర్నూలులో ఏర్పాటు చేసిన గ్రీన్ కో రెన్యువల్ ఎనర్జీ ప్రాజెక్టు ఎంతో గొప్పదని డిప్యూటీ సిఎం చెప్పడం అభినందనీయమని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.


ముగ్గులు వేస్తున్న మహిళలు

ముగ్గుల పోటీకి విశేష స్పందన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక సత్తెమ్మ కాలనీ, శోభ థియేటర్ ప్రాంతాల్లో ఆదివారం డివైఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు, పిఎన్ఎం, పిసిసిల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. అధిక సంఖ్యలో మహిళలు ఈ పోటీల్లో పాల్గొని ముగ్గులలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ ముగ్గుల పోటీకి న్యాయం నిర్ణేతగా ఉపాధ్యాయరాలు దువ్వూరి అన్నపూర్ణ వ్యవహరించారు. ఈ పోటీలను ప్రజాసంఘాల నాయకులు దారపురెడ్డి కృష్ణ, సిరపరపు శ్రీనివాస్, రొంగల అరుణ్‌కుమార్, అమృత, నమ్రత, బంగారురాజు, మంజుల, పూజిత, నిహారిక, అఖిల, మణికంఠ, పవన్, బంగారం, మనోజ్ తదితరులు పర్యవేక్షించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు, నాయకులు

ప్రజాశక్తి - పిఠాపురం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి జూనియర్ అర్చరీకి క్రీడాకారులు ఎంపికయ్యారు. ఆదివారం స్థానిక ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్చరీ జూనియర్ బాలురు, బాలికల ఛాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీలను ఎపి శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకె జగదీష్, విరవాడ సర్పంచ్ బోయి నాగేశ్వరరావు, ఆర్చరీ అసోసియేషన్ సభ్యులు సోము గోవిందరాజు, కె.చిన్నబ్బాయి, జె ప్రసాదరావు ప్రారంభించారు. ఈ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నలమూలాల నుంచి 45 మంది బాల, బాలికలు హాజరయ్యారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభను చాటుకున్న బాలురు ఆరుగురు, బాలికలు ఆరుగురిని రాష్ట్ర స్థాయి జూనియర్ ఆర్చరీ పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 23 నుంచి 25 వరకు విజయవాడలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఇండియన్ రౌండ్ విభాగంలో పాల్గొంటున్నారని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మణరావు తెలిపారు. అనంతరం ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు అతిథులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వి.కేశవరావు, కౌన్సిలర్లు రాయుడు శ్రీనివాసరావు, అల్లవరపు నగేష్, అభ్యుదయ ఫౌండేషన్ బాదం సూర్య ప్రకాష్, అసోసియేషన్ అధ్యక్షులు ఇమిడిశెట్టి నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా జి.శివప్రసాద్, పి.సాయి, బి.నవీన్, వంశీ వ్యవహరించారు.

కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో సంక్రాంతి పండగ నేపథ్యంలో సంప్రదాయం పేరుతో కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి డి.నరసింహకిశోర్ హెచ్చరించారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. జిల్లాలో కోడి పందేలు, పేకాట, గుండాట తదితర జూదాల నిర్వహణకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో స్థానికులతో మాట్లాడి అవగాహన కల్పించామన్నారు. జూదాల వల్ల పేద ప్రజానీకంపై తీవ్ర ఆర్థిక ప్రభావం పడుతున్నందున వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రజలకు ఆయన సూచించారు.

బైండోవర్ కేసుల నమోదు

కోడి పందేలు, జూదాలు ఆడకుండా జిల్లా వ్యాప్తంగా పాత నేరస్తులపై నిఘా ఉంచాం. తాళ్లపూడి మండలంలోని 6 గ్రామాల్లో, చాగల్లు మండలంలో 4 గ్రామాల్లో, కొవ్వూరు మండలంలో 8 గ్రామాల్లో నిడదవోలులో సింగవరం, కడియం మండలంలో శివారు గ్రామాలు అదే విధంగా జిల్లాలోని 18 మండలాల్లో బరులు నిర్వహిస్తారని సమాచారం ఉన్న ప్రతీ చోటా అక్కడ స్టేషన్ హౌస్ ఆఫీసర్ల ద్వారా ప్రత్యేక నిఘా ఉంచాం.

స్థలాల యజమానులకు నోటీసులు

కోడి పందేలు, జూదాల నిర్వహణకు ఆయా ప్రాంతాల్లో కొందరు స్థలాల యజమానులకు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశాం. అనుమానిత స్థల యజమానులకు ఇప్పటికే నోటీసులు అందించాం. గతంలో పందేలు నిర్వహించిన కొన్ని స్థలాల యజమానులను గుర్తించి వారికి అవగాహన కల్పించాం. అన్ని మండలాల్లోనూ అవగాహన సదస్సులు, మైక్ ప్రచారాలు జరిపాము.

జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బందాలు

కోడి పందేలు, జూదాలు నిర్మూలించకుండా జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ఈ బృందంలో ఒక స్టేషన్ హౌస్ అధికారి, ఒక రెవెన్యూ అధికారి, ఒక పశుసంవర్ధక శాఖ సిబ్బంది లేదా ఒక ఎస్‌ఐ ఉంటారు.

సంప్రదాయ క్రీడలే ముద్దు

కోడి పందేలు, గుండాట, ఇతర నిషేధిత ఆటలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తప్పవు. ముఖ్యంగా యువత జూద క్రీడలకు దూరంగా ఉండాలి. ఈ క్రీడలలో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటాం. ఈ క్రిమినల్ కేసుల్లో యువత చిక్కుకుంటే వారు భవిష్యత్తులో ఉద్యోగావకాశాలు కోల్పోతారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో సంప్రదాయ క్రీడలు మొగ్గుచూపాలి. కుటుంబ సభ్యులతో ఆనందంగా ఈ పండుగను జరుపుకోవాలి.

ప్రజాశక్తితో ఎస్‌పి నరసింహకిశోర్



ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి : కలెక్టర్

జిల్లాలోని పలు ప్రాంతాల్లో జాతీయ యువజన ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ ప్రస్తుత సమాజంలో ప్రతీ ఒక్కరూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి కోరారు. ఆదివారం స్వామి వివేకానంద జయంతి(జాతీయ యువజన దినోత్సవం) సందర్భంగా జిల్లా యువజన సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రాజా ట్యాంకు వివేకానంద పార్కులోని వివేకానందుని విగ్రహానికి ఎంఎల్‌ఎ కొండబాబు, వనమాడి వెంకటేశ్వరరావు లతో కలిసి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం ఉంటే ఎంతటి కార్యం అయినా సాధించ వచ్చునని అన్నారు. పిరికితనం విజయానికి దూరం చేస్తుం దన్నారు. ఆత్మవిశ్వాసమే విజయ తీరాలవైపు నడిపిస్తుందని యావత్ ప్రపంచానికి స్వామి వివేకానంద చాటారని అన్నారు. ఎంఎల్‌ఎ కొండబాబు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉందని అన్నారు. స్వామి వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఆత్మవిశ్వాసంతో యువత ముందడుగు వేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ శాఖ సిఇఒ కెపిఎస్.కిశోర్, స్వామి వివేకానంద సేవా సమితి ప్రెసిడెంట్ వి.ఎల్.గాంధీ, వైస్ ప్రెసిడెంట్ వి.రామకృష్ణ, సెక్రటరీ కె.శర్మ, కె.రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు. **కరప** స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి డాక్టర్ బొండ సూర్యారావు, సర్పంచ్ సాధే ఆశాజ్యోతి, వైస్ ఎంపిపి పోట్నీడి సత్య భీమేశ్వరరావు, నక్కా వీర్రభద్రరావు యార్ల పండు, నక్కా సత్తిబాబు, గొర్రెల వెంకన్న, దేవు వెంకటేశ్వరరావు, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. **పెద్దాపురం** స్థానిక నవోదయ విద్యాలయంలో వివేకానంద జయంతిని నిర్వహించారు. ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ రామకృష్ణయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన లిటరరీ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సనపల సత్యనారాయణ, వి.ఆనంద్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఏడీబీ రోడ్డు ఆంజనేయస్వామి గుడి సెంటర్లోని వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గా మోహన్‌రావు, గోరకపూడి చిన్నయ్యదొర, కొత్త వీరభద్రరావు, దేవర శ్రీను, పాల్గొన్నారు. **గండేపల్లి** ఆదిత్య ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద జ్ఞాపకార్థం జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీన్ క్యాంపస్ లైఫ్ మేనేజ్‌మెంట్ ప్రొ వి.సత్యనారాయణ, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ బి.హెచ్.వి.వరప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ బి.రాంబాబు, ఐవి.వీరాంజనేయులు, విద్యార్థులు, వాలంటీర్లు పాల్గొన్నారు. **సామర్లకోట** మండలంలోని పెద్దబ్రహ్మదేవం గ్రామంలో శారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ వీధుల్లో శోభా యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్, సమితి కార్యదర్శి విజ్ఞమూరి విశ్వనాథ్, సభ్యులు నువ్వుల వెంకటరాజు, నువ్వుల బాబ్జీ, తాడాల దొరబాబు, తోటకూర శ్రీనివాస్, రాంబాబు పాల్గొన్నారు. **జగ్గంపేట** స్థానిక స్వామి వివేకానంద విద్యా సంస్థలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థల అధినేత ఒమ్మి రఘురాం ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

కోడి పందేల బరులు సిద్ధం

-పోలీసుల హెచ్చరికలు బేఖాతరు
-పలు బరులను ధ్వంసం చేసిన అధికారులు

సంక్రాంతి సంబరాల పేరుతో జిల్లాలో కోడి పందేల బరులు సిద్ధం అయ్యాయి. పందేల నిర్వహణకు ఏర్పాట్లు చేసిన కొన్ని బరులను గత రెండు రోజులుగా అధికారులు ధ్వంసం చేశారు. అయితే సంక్రాంతికి ఒక్క రోజు ముందు రాత్రికి రాత్రే భారీ సెటింగులతో పందేల బరులు సిద్ధం అయ్యాయి. భోగి, సంక్రాంతి, కనుమ పండుగ వరకూ రాత్రి పగలు తేడా లేకుండా కోడి పందేలు, గుండాట వంటి క్రీడలు నిర్వహించేందుకు ప్రతీ మండలంలో 20 నుంచి 30 బరులు సిద్ధం అయ్యాయి.

ప్రజాశక్తి - యంత్రాంగం

పిఠాపురం డిప్యూటీ సిఎం, స్థానిక ఎంఎల్‌ఎ పవన్ కళ్యాణ్ ఇలాకాలోని పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో కోడిపందాల నిర్వహణకు బరులు సిద్ధం అయ్యాయి. టిడిపి, జనసేన పార్టీలకు చెందిన నాయకులు పిఠాపురం మండలం, పట్టణంలో 16, కొత్తపల్లి 11, గొల్లప్రోలు 8 మొత్తంగా 35 చోట్ల బరులు సిద్ధం చేశారు. వీటిలో 11 చోట్ల టిడిపి, జనసేన పార్టీలకు చెందిన నాయకులు ఏర్పాటు చేశారు. మిగిలిన బరులన్నీ జనసేన నాయకుల సారథ్యంలో ఏర్పాటు అయ్యాయి. స్థానిక వైఎస్‌ఆర్ గార్డెన్స్‌లో వేదికపైనే మట్టితో ప్రత్యేక బరిని ఏర్పాటు చేయడం విశేషం. **యు.కొత్తపల్లి** సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో కోడి పందేల నిర్వహణకు బరులను సిద్ధం చేశారు. ఈ బరుల ఏర్పాటులో టిడిపి, జనసేన పార్టీల నాయకుల మధ్య విభేదాలు పొడచూపాయి. ఇదిలావుంటే కొన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన బరులను అధికారులు ధ్వంసం చేశారు. పోలీసుల హెచ్చరికలు ఎలావున్నా కోడి పందేలు నిర్వహించి తీరుతామని నిర్వాహకులు స్పష్టం చేస్తున్నారు. అయితే అనుకూలంగా ఉన్న మండలంలోని అనేక గ్రామాల్లో టిడిపి, జనసేన పార్టీల నాయకులు పందెం బరులను ఏర్పాటు చేశారు. **గండేపల్లి** మండలంలోని పలు గ్రామాల్లో కోడిపందేలు, గుండాట, పేకాట, బొమ్మబొరుసు వంటి జూదాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయి. వివిధ గ్రామాల్లో ప్రత్యేకంగా కోడి పందేల నిర్వహించేందుకు బరులను సిద్ధం చేశారు. ఆయా బరులను దక్కించుకునేందుకు నిర్వాహకులు వేలం పాటల్లో నిర్వాహకులు లక్షలాది రూపాయలు చెల్లించేందుకు ఒప్పుకుని బరులను దక్కించుకున్నారు. **కాజులూరు** మండలంలోని గొల్లపాలెం, జగన్నాధగిరి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కోడిపందేల బరులను అధికారులు ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మోహన్‌కుమార్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గ్రామాల్లో కోడిపందాలు, గుండాట, పేకాట, అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల వీఆర్‌ఒలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. **పెద్దాపురం** మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎస్ఐ వి.మౌనిక ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించి కోడిపందేల నిర్వాహకులు ఏర్పాటుచేసిన టెంటులను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మైక్ ద్వారా కోడిపందేలు నిషేధంపై ప్రచారం నిర్వహించారు. **సామర్లకోట** మండలంలోని పలు పందెం బరులను తహశీల్దార్ కె.చంద్రశేఖర్‌రెడ్డి, సిఐ కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో అధికారులు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ కోడిపందేల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశామని, 80 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.



పిఠాపురంలో పందేలకు సిద్ధమైన బరి



సామర్లకోటలో బరులను ధ్వంసం చేస్తున్న అధికారులు

ఓ గంజాయితో భవితకు ముప్పు

ప్రజాశక్తి - పిఠాపురం

యువత గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటుపడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సిఐ జి.శ్రీనివాస్ సూచించారు. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవించే వ్యక్తులను, గంజాయి కేసుల్లో ముద్దాయిలకు వారి కుటుంబీకుల మధ్య ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు, గంజాయి సేవించడంతో మంచి చెడు ఆలోచన పరిజ్ఞానం కోల్పోతారన్నారు. తన, మన తేడా తెలియకుండా ప్రవర్తిస్తారని అన్ని రకాల నేరాలకు మత్తు పదార్థాలే మూలకారణమన్నారు. 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే నినాదంతో వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ గుణశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

కోరమాండల్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

వాకలపూడిలో కోరమాండల్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కర్మాగారం ముఖ్య అధికారి సిహెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ మన సనాతన సంస్కృతి సంప్రదాయాలకు, ఆధ్యాత్మికతకు సంక్రాంతి పండుగ ఒక ప్రతీకగా నిలుస్తుందన్నారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కర్మాగార జనరల్ మేనేజర్ పద్మ నాభం, మహిళా సంక్షేమ సంస్థ అధ్యక్షులు వెంకటలక్ష్మి, కార్యదర్శి మల్లీశ్వరి, కోశాధికారి శ్రీదేవి, సభ్యులు పాల్గొన్నారు.

వాస్తవాలను వెలికితీసే పత్రిక ప్రజాశక్తి

ప్రజాశక్తి - జగ్గంపేట, గండేపల్లి

వాస్తవాలను వెలికి తీసే పత్రిక ప్రజాశక్తి అని టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ప్రజాశక్తి దినపత్రిక- 2025 క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిత్యం పోరాడే పత్రిక ప్రజాశక్తి అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎం.భద్రం, చిట్టిబాబు, జాస్తి వసంత్, భాస్కరరావు, పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నవీన్

ముగిసిన వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి - కోటనందూరు

సంక్రాంతి పండుగ సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక మదర్ విద్యాసంస్థల్లో ఆదివారం నిర్వహించిన వాలీబాల్ పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో ముగిశాయి. ఈ టోర్నమెంటులో విన్నర్‌గా బిళ్లనందూరు జట్టు నిలిచింది. విన్నర్‌కు రూ.10 వేలు, రన్నర్‌గా నిలిచిన పాతకొట్టం జట్టుకు రూ.5 వేలు, సెమిస్‌లో ఆడిన జట్టుకు రూ.2,500 చొప్పున నగదు బహుమతితోపాటు, షీల్డ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐ జి.చెన్నకేశవరావు, ఎస్ఐ టి.రామకృష్ణ, టిడిపి అధ్యక్షులు కోటనందూరు కృష్ణ, కూనపు నాయకులు దంతులూరి చిరంజీవిరాజు, వెలగా వెంకటకృష్ణారావు, రాజు శేషు పాల్గొన్నారు.

మల్లిబాబుకు ఎంఎల్‌ఎ పంతం పరామర్శ

ప్రజాశక్తి - కరప

జనసేన మండల కార్యదర్శి పప్పుల మల్లిబాబును ఎంఎల్‌ఎ పంతం నానాజీ పరామర్శించారు. మల్లిబాబు తల్లి రమావతి ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయన మల్లిబాబు స్వగ్రామానికి చేరుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శ కార్యక్రమంలో నాయకులు హరినాథ్, బందారు మురళీ, తుమ్మలపల్లి గోవింద, గంట మల్లేశ్వర స్వామి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎంఎల్‌ఎ పంతం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌ఎ

గోకులాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

పాడి రైతులు మినీ గోకులం షెడ్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ సూచించారు. మండలంలోని బి.రాయవరం గ్రామంలో నిర్మించిన మినీ గోకులం షెడ్డును ఆమె ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మినీ గోకులం ఏర్పాటుతో పాడిపశువులు వాన, ఎండ వడ దెబ్బలకు గురికాకుండా ఆరోగ్యంగా ఉంటాయన్నారు. అనంతరం ఉత్తర కంచి నుంచి పెద్దిపాలెం రహదారిని రూ.1.50 కోట్లతో నిర్మించే నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వం ఈ రహదారి పట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రహదారుల నిర్మాణానికి ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కుమార్‌బాబు, ఎపిఒ కుమార్‌స్వామి, టిడిపి నాయకులు కొమ్ముల కన్నబాబు, చక్కపల్లి మందేశ్వరరావు, మంతెన శ్రీను, ఇళ్ల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో భారీ చోరీ

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం పట్టణం కూరసాల వారి వీధిలో కోలా శేషు ఇంటిలో శనివారం రాత్రి దొంగలు పడి సుమారు 30 కాసుల బంగారం, రూ.లక్షా 50 వేల నగదు అపహరించినట్లు ఇంటి యజమాని శేషు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి గదిలో ఆయన నిద్ర స్తుండగానే దొంగలు బంగారం, నగదు దొంగిలించారని తెలిపారు. డిఎస్‌పి ప్రసాద్, పట్టణ సిఐ వీరబాబు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేల నిర్వహణను అడ్డుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం

డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో కోడిపందేలు, జూదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ కె.శ్రీరమణి ఆదివారం ఓ ప్రకటనలో అధికారులను ఆదేశించారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో కోడిపందాలు, జూదాలు జరగకుండా రెవెన్యూ, పోలీసు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో అధికారులు, సిబ్బంది పర్యటించి తనిఖీలు నిర్వహించాలన్నారు. సంక్రాంతి పర్వదినాలను సంప్రదాయ బద్ధంగా నిర్వహించుకునేలా ప్రజలను ప్రోత్సహించాలన్నారు. డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని సూచించారు.

అండర్-14 క్రికెట్‌కు రేవంత్ ఎంపిక

ప్రజాశక్తి - కరప

కరప గ్రామానికి చెందిన అడపా రేవంత్ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరుపున అండర్-14 క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు బొండా సూర్యారావు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, పూర్వ విద్యార్థి సంఘం, ప్రజా ప్రతినిధులు నాయకులు గ్రామ ప్రజలు రేవంత్‌ను పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. మరిన్ని విజయాలు సాధించాలని అంతర్జాతీయ క్రికెట్ సెలెక్ట్ అవ్వాలని ఆకాంక్షించారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక సత్యనారాయణపురంలో సంక్రాంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఎస్‌ఎస్‌పి ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ ముగిసింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో శివ సిక్సర్స్ టీమ్ విన్నర్‌గానూ, ఎస్‌ఎస్‌పి ఇండియన్ టీమ్ రన్నర్‌గా నిలిచింది. విజేతలకు ఆతిథుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సేపేని సురేష్, టిడిపి నాయకులు పడాల వీరబాబు, నాయకులు పుప్పాల గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం, క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శ్రీ సత్యసాయి మందిరంలో చల్ల సాయిరాం అధ్యక్షతన ఆదివారం బాలబాలికలకు చిత్రలేఖనం, క్విజ్, ఏకాగ్రతాపై పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతైన ఇద్దరు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు యర్రా గోవిందరాయలు, వై.వీరభద్రరావు, హెడ్‌ఎమ్‌ఎస్ స్టేట్ చైర్మన్ ఎన్.శ్రీనివాస్, కె.రాధిక, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉత్సవ మండపం ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ అమ్మవారి ఆలయం వద్ద భక్తుల సహాయ సహకారాలతో నిర్మించిన ఉత్సవ మండపాన్ని నేడు ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప, ఎంపి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ప్రారంభిస్తారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె విజయలక్ష్మి తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కుడా చైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొంటారని ఆమె తెలిపారు.

జూదాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - పిఠాపురం

కోడిపందేలు, జూదాల పట్ల యువత దూరంగా ఉండాలని ఎస్ఐ వి.మణికుమార్ కోరారు. పట్టణ పరిధిలో ఆటో మైక్ ద్వారా ప్రచారం నిర్వహించారు. అందరూ సాంప్రదాయ క్రీడలను ప్రోత్సహించి ఈ సంక్రాంతిని వారి కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

టిడిపి నాయకునికి పరామర్శ

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని హుస్సేన్ పురం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు కోట అప్పారావును ఎంఎల్‌ఎ చినరాజప్ప తనయుడు రంగనాథ్ పరామర్శించారు. మాతృవియోగంతో బాధపడుతున్న అప్పారావును పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లా బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు



ఒకే వేదికపైకి చేరుకున్న పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - యానాం

విద్యాభ్యాసం అనంతరం వివిధ ప్రాంతాల్లో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా 38 ఏళ్ల తర్వాత కలుసుకుని ఆ మధురజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. స్థానిక మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర హైస్కూల్ 1987 బ్యాచ్ విద్యాసంవత్సరంలో 10వ తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులంతా ఆదివారం తాము చదువుకున్న చదువులమ్మ చెట్టునీడకు మళ్లీ చేరుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ వారి కుటుంబసభ్యులు తదితర విశేషాలను పంచుకుంటూ ఆనందోత్సాహాల మధ్య రోజంతా ఆటపాటలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆనందంగా గడిపారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు సలాది సుబ్బారావు, సలాది సాంబశివరావు, సౌభాగ్యవతి, ధూళిపూడి నాగేశ్వరరావు, ఖాదర్ గృహాలకు వెళ్లి వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైమానిక దళ మాజీ అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి దడ్డలూరి బలిపీఠస్వామి, నిసర్గ ఇన్ఫర్మేషన్ అధినేత కన్నన్, తదితరులు పాల్గొన్నారు.



భోగీ మంటను చిన్నారులతో వెలిగిస్తున్న చైర్మన్ జయరామారావు

శ్రీ వేద స్కూల్లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక శ్రీ వేద స్కూల్లో చైర్మన్ గుత్తుల గోవింద జయరామారావు, డైరెక్టర్ అర్జున్ నీతూహరి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాజమాన్యం, విక్రాంత హెచ్‌ఎం వీరభద్రరావు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులకు భోగి పళ్లు పోసి ఆశీర్వదించారు. చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించి సంబరాల్లో పాల్గొన్నారు. హరిదాసు వేషధారణ, సోదమ్మ, గోదాదేవి రూపాలంకరణ, వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా జాతీయ యువజన దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ బలిత కళాశాలలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, నెహ్రూ యువ కేంద్ర సంఘటన ఆంధ్రప్రదేశ్, యానాం డైరెక్టర్ అన్నమాన్ ప్రసాద్‌దాస్ పాల్గొన్నారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి తిరి గోపి, ఎన్‌ఎస్‌ఎస్ రీజనల్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణసుందర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.ముత్యాలు, వాసంశెట్టి ఆనంద్ పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

పిఠాపురం : స్థానిక జనసేన కార్యాలయం వద్ద వీరమహిళల ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ చల్లా లక్ష్మి, ఎంపీటీసీ సీతామహాలక్ష్మి, డాక్టర్ లక్ష్మి, గీతారాణి, పి.రమ్యజ్యోతి వ్యవహరించారు. మహిళలు ఎంతో ఉత్సాహంగా ముగ్గుల పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలకు ఎంపి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రముఖ డైరెక్టర్ సానా బుచ్చిబాబును ఎంపి ఉదయ శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన వీర మహిళలు నాగమణి, నాగలక్ష్మి, నాగిని, దేవి, ప్రమీల, జనసేన నాయకులు సురేష్, సతీష్ పాల్గొన్నారు.